క్లుప్తంగా

ఘనంగా ముత్యాలమ్మతల్లి తీర్థం


ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మతల్లి

కొత్తపల్లి: గ్రామ దేవత ముత్యాలమ్మతల్లి తీర్థం సోమవారం ఘనంగా జరిగింది. పండితులు అమ్మవారిని పూలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, ఉప్పాడ గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. కాగా ఉదయం చిరుతాడిని గరగ నృత్యాలతో కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామాల్లో ఘనంగా ఊరేగించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు మంత్రి పర్యటన

సామర్లకోట: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మంగళవారం పెద్దాపురం నియోజకవర్గంలో పర్యటిస్తారు. ఉదయం పెద్దాపురంలోని ఇండస్ట్రియల్ పార్కుకు శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. అనంతరం సామర్లకోటలో నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. తర్వాత సామర్లకోట మండలంలోని అచ్చంపేట గ్రామంలో నిర్మించిన 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తారు.

టీటీడీసీలో నేడు జాబ్ మేళా

సామర్లకోట: నిరుద్యోగ యువతీ, యువకుల కోసం స్థానిక టీటీడీసీలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదివిన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు బయోడేటాతో పాటు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

మరిడమ్మ ఆలయంలో చండీ హోమం


ఆలయంలో నిర్వహిస్తున్న చండీ హోమం

సామర్లకోట: పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న మరిడమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ హోమం జరిగింది. పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు వేద పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ఆక్రమణలపై దృష్టి సారించాలి

సామర్లకోట: పట్టణంలోని సంగీతరావుపేటలో మితిమీరుతున్న ఆక్రమణలపై దృష్టి సారించాలని ట్రాన్స్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘ నాయకుడు, స్థానికుడైన వీసం వీరనాగు కోరారు. ఈ మేరకు సోమవారం కాకినాడలో జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. స్థానిక విలేకరులకు ఈ వివరాలు వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు పార్కు వెనుక భాగాన ఉన్న బహిరంగ మరుగుదొడ్లను తొలగించడంతో ఆ ప్రాంతంలో ఆక్రమణలు పెరిగిపోయాయన్నారు. కొత్త తహసీల్దార్ కార్యాలయం వెనుక ప్రాంతం ఎంతో అపరిశుభ్రంగా ఉందని ఫిర్యాదు చేశానన్నాడు.

ఏపీ ఫైబర్‌నెట్ సమస్యలు పరిష్కరించాలి


డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న ఆపరేటర్లు

సామర్లకోట: తక్కువ ఖర్చుతో కేబుల్ ప్రసారాలు వీక్షిస్తున్న పేద, మధ్యతరగతి వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఫైబర్‌నెట్ కేబుల్ ఆపరేటర్లు కోరారు. కేబుల్ ఆపరేటర్ల ప్రతినిధులు జి.సుబ్రహ్మణ్యం, వీవీబీ రావు సోమవారం ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ, ఏపీ ఫైబర్‌లో సాంకేతిక సమస్యల కారణంగా ప్రసారాలకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. సమస్యలను పరిష్కరించాలని కాకినాడలో డీఆర్వో జె.వెంకట్రావుకు వినతిపత్రం అందజేశామని తెలిపారు.

సామర్లకోట అధికారుల ఫోన్ నంబర్లు

మున్సిపాలిటీ

మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447

ఝుమ్మంది నాదం !



ప్రదర్శన ఇస్తున్న చేబ్రోలు చిన్నారులు


ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులు

- మొక్కవోని దీక్షతో.. మురిసిన కళలతో...!
- చేబ్రోలులో కళాకారులను తీర్చిదిద్దుతున్న అకాడమీ

పిఠాపురం: ఎక్కడ ఉత్సవాలు జరిగినా అక్కడ చిన్నారుల సాంస్కృతిక నృత్యాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. ఒకరు కాదు ఇద్దరు కాదు 35 మంది నాట్యంలో ఆరితేరిన కళాకారులు. వారు చేసే నృత్యాలు పెద్దపెద్ద కళాకారులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తుంటాయి. భరతనాట్యం భావోద్వేగానికి గురి చేస్తే.. కూచిపూడి మనసును కుదిపేస్తుంటే..ఆంధ్రనాట్యం అలరిస్తుంటే.. జానపదాలు జాలువారుతూ తన్మయత్వానికి గురిచేస్తుంటాయి. పాటకు తగ్గట్టుగా పసికూనలు నాట్యం చేస్తుంటే గంటల తరబడి కదలకుండా ఉండిపోవాల్సిందే. నాట్యం అంటే ఏంటో తెలియని వయసులో ఉన్న వారిని అనతి కాలంలోనే నాట్యాచారులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడు కొల్లూరి సీతారామమూర్తి మాస్టారు చేస్తున్న కృషి ఎనలేనిది. తనకు నాట్యం రాకపోయినా కళలపై ఉన్న మక్కువతో తన సొంత ఖర్చులతో కళలకు ప్రాణం పోస్తున్నారు. ఉత్సాహం ఉన్న ప్రతిభావంతులైన చిన్నారులకు నృత్యాలను నేర్పిస్తూ కళలకు కొత్తకళ తీసుకువస్తున్నారు. తన ద్వారా కళలను నేర్చుకున్న కళాకారులు సాధించే జ్ఞాపికలే తనకు తీపి జ్ఞాపకాలు, ఆస్తులు అంటున్నారు ఆయన.

ఉగ్గు పాలతో ఊయల ఊపినట్టు



మాస్టారు ఆధ్వర్యంలో నాట్యం నేర్పితే ఉగ్గుపాలతో ఊయల ఊపినట్టుగా ఉంటుంది. సొంత పిల్లలను సాకినట్టుగా మమ్మల్ని ఆప్యాయంగా అక్కున చేర్చుకుని నేర్చుకోవాలనే తపనను పెంచుతారు. అందువల్లే అతి తక్కువ సమయంలోనే నాట్యం నేర్చుకోగలుగుతున్నాం. ఆయన చెప్పించే తీరు జీవితంలో ఎప్పుడు మర్చిపోలేని విధంగా ఉంటుంది. పలు ప్రదర్శనలు ఇచ్చాను.

అల్లంరాజు అన్నపూర్ణ, చేబ్రోలు

కళాభివృద్ధే ధ్యేయం



నాట్యం, కళలను అభివృద్ధి చేయాలనే ధ్యేయంతో చేబ్రోలులో నృత్యాంజలి అకాడమీ స్థాపించాను. నేను ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాను. చిన్నప్పటి నుంచి నాకు కళలంటే చాలా మక్కువ. మా స్వగ్రామమైన చేబ్రోలులో కనుమరుగవుతున్న కళలకు ప్రాణం పోయాలని నాకు ఎప్పటి నుంచో ఉండేది. రెండేళ్ల క్రితం మా గ్రామంలోని రామాలయంలో నృత్యాంజలి అకాడమీ పేరుతో నాట్య శిక్షణా కేంద్రం ఏర్పాటు చేశాను. ప్రారంభంలో 10 మందితో మొదలు పెట్టాను. వారి నైపుణ్యం చూసి మరో 25 మంది పిల్లలు వచ్చి నాట్యం నేర్చుకుంటున్నారు. ప్రాచీన కళలైన కూచిపూడి, కర్ణాటక సంగీతం వంటి అంశాలను గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు పరిచయం చేయడంతో పాటు బాల్యం నుంచి పిల్లల్లో ఆధ్యాత్మిక భావనలను పెంపొందించాలనే ఉద్దేశంతో కాకినాడకు చెందిన నృత్యాంజలి అకాడమీ వ్యవస్థాపకులు హరి కృష్ణవేణి, అల్లంరాజు శాంభవితో ప్రతి ఆదివారం, బుధవారం కూచిపూడి నాట్యంలో తర్ఫీదు ఇప్పిస్తున్నాను. ఇక్కడ నాట్యం నేర్చుకున్న విద్యార్థులు ఇప్పటికే చేబ్రోలు, అన్నవరం తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు పొందారు. ములుకూరి సత్యవతి చిన్నారులకు ప్రతి ఆదివారం భగవద్గీత శ్లోకాల పఠనంపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి కర్ణాటక సంగీతంలో కూడా శిక్షణ ప్రారంభిస్తున్నాం.

– కొల్లూరి సీతారామమూర్తి, నృత్యాంజలి అకాడమీ, నిర్వాహకుడు, చేబ్రోలు

ఎంతో ఆనందంగా ఉంది



మా ఊళ్లో నాట్యం నేర్పుతున్నారంటే సరదాగా వెళ్లి చూసేదానిని. నాకు నేర్చుకోవాలని కుతుహలం కలిగి మాస్టారు అడిగితే వెంటనే చేర్చుకుని నాకు నేర్పించారు. దీంతో కేవలం కొన్ని నెలల్లోనే నాట్యం నేర్చుకున్నా. ఇప్పుడు ఎక్కడ ప్రదర్శనలు ఉన్నా వెళ్లి నాట్యం చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నా. నాట్యం నేర్చుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– తిడిశెట్టి చిన్ని, చేబ్రోలు

ఏడాదిగా నాట్యం నేర్చుకుంటున్నాను



చిన్నప్పటి నుంచి నాట్యం నేర్చుకోవాలనే కోరిక ఉండేది. నాట్యం నేర్చుకోవాలంటే చాలా ఖర్చు అవుతుంది. కాని మూర్తి మాష్టారు నాకు ఉచితంగా నాట్యం నేర్పిస్తున్నారు. ప్రతి విషయం సరదాగా చెబుతూ నేర్పిస్తుండడంతో చాలా తొందరగా నాట్యంలో మెళకువలు నేర్చుకున్నాను. ఇంకా నేర్చుకుంటున్నాను. నాలా చాలా మంది పిల్లలను ఆయన నాట్యంలో రాటుదేలేలా కృషి చేస్తున్నారు.

చల్లా హేమలత, చేబ్రోలు

అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాం



మా గ్రామంలో మా ఇంటికి దగ్గరలో గురువులు వచ్చి నాట్యం నేర్పించడాన్ని మేమందరం సదావకాశంగా భావించాం. దానిని సద్వినియోగం చేసుకుని నాట్యం నేర్చుకుంటున్నాం. సరదాగా ఆట పాటలతో తిరిగే మేము ఇప్పుడు ఖాళీ సమయాల్లో నాట్యం ప్రాక్టీస్ చేస్తూ మరింత బాగా నేర్చుకుంటున్నాం. మా ప్రదర్శనలు చూసిన ప్రతిఒక్కరూ అభినందిస్తుంటే ఎక్కడా లేని ఆనందం కలుగుతోంది.

బత్తినీడి రామసుధ, చేబ్రోలు

మాస్టారి ప్రోత్సాహంతోనే..



నన్ను నాట్యం నేర్చుకోమని మాస్టారు చెప్పారు. మా ఇంటికి వచ్చి మా అమ్మానాన్నలను ఒప్పించారు. నేను ఏడాదిగా నాట్యం నేర్చుకుంటున్నా. కూచిపూడి నాట్యంలో అన్ని మెళకువలు నేర్చుకుని ఇప్పుడు ప్రదర్శనలు ఇస్తున్నాను. నా నాట్యం చూసి మా ఊళ్లో వాళ్లందరూ ఆశ్చర్యపోతున్నారు. సరదాగా నేర్చుకున్న కళ నాకు మంచి గుర్తింపు తెస్తోంది.

వడగన సమన్వి, చేబ్రోలు

విద్యార్థుల సమస్యలపై సీపీఎం ధర్నా


సామర్లకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సామర్లకోట: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం గోవిందరావు అన్నారు. విద్యార్థుల సమస్యలతో పాటు, మాధవపట్నంలో ట్రాఫిక్ సమస్యపై సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ పద్మజారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ, 1972లో ప్రారంభించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రస్తుతం శిథిల స్థితికి చేరిందని, పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల భవనం దుస్థితిని చూసి, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కళాశాలలో తమ పిల్లలను చేర్చడానికి భయపడుతున్నారన్నారు. దీంతో కనీస మౌలిక సదుపాయాలు లేకపోయినా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు కళాశాలలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మాధవపట్నంలో ఉన్న రైల్వే గేటు మూసిన సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుందని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో రైల్వే ట్రాక్ మీదుగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కరణం ప్రసాదరావు, బాలం శ్రీనివాసు, కరణం ఏడుకొండలు, ఎస్.యువరాజు, పసుపులేటి వీరబాబు, బాలం హరి, చల్లా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నమాచార్యులు జయంతి


అన్నమాచార్య జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న స్వామీజీలు


వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

పిఠాపురం: స్థానిక గోపాల్ బాబా ఆశ్రమంలో సోమవారం తాళ్లపాక అన్నమాచార్యులు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కాకినాడ జిల్లా అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామీజీ, కాకినాడ జిల్లా జనసేన అధ్యక్షులు తుమ్మల రామస్వామి, కాకినాడ జిల్లా భారతీయ జనతా పార్టీ జనరల్ సెక్రటరీ గండి కొండలరావు, బీజేపీ నేత తోట ఏడుకొండలు, చిత్రాడ విశ్వానంద భారతీ స్వామీజీ, మహాశక్తి పీఠం లక్ష్మీ ప్రసన్న మాతాజీ తదితరులు పాల్గొని అన్నమాచార్యులును స్మరించుకున్నారు. అన్నమయ్య కళాక్షేత్రం కాకినాడ జిల్లా అధ్యక్షులు చానా నూకరాజు, సమన్వయకర్త సునీత తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆలయంలో..

పిఠాపురంలో వేంచేసిన తిరుమల తిరుపతి దేవస్థానముల పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో తాళ్లపాక అన్నమాచార్యులు జయంతిని వైభవంగా నిర్వహించారు. అన్నమాచార్యులు కీర్తనలను ఆకొండి వెంకట్రావు, శిష్య బృందం, వింజమూరి గాయత్రి శిష్య బృందం, పరకాల సుబ్బరాయ శర్మ శిష్య బృందం గానం చేసి మైమరపించారు. సప్తగిరి సంకీర్తన గానంలో సుమారు 50 మంది కళాకారులు పాల్గొని స్వామివారికి స్వరార్చన చేశారు. వాయిద్య సహకారం పురాణం గణపతి రావు, గట్టి కృష్ణ కాంత్ తదితరులు అందించారు.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం


మాండవ్య నారాయణస్వామికి నిర్వహిస్తున్న గ్రామోత్సవం

సామర్లకోట: గోదావరి కాలువ ఒడ్డున ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్యనారాయణ స్వామి గ్రామోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో సాగింది. పౌర్ణమిని పురస్కరించుకుని సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. అనంతరం గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి కాలిబాట వంతెన, ఫ్లై ఓవర్ బ్రిడ్జి, స్టేషన్ సెంటర్, గోలివారి వీధి, గాంధీచౌక్, చిన్నవీధి, పెద్దవీధి, యార్లగడ్డవారి వీధి, మఠం సెంటర్, అయోధ్య రామపురం, కొత్తూరు మీదుగా గ్రామోత్సవం ఆలయానికి చేరింది. భక్తులు స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పద్మనాభాచార్యులు, రఘురామ్ ఆచార్యులు, రవికుమార్ ఆచార్యులు భక్తులకు ఆశీర్వాదాలు అందజేశారు.

అహంకారం వీడి.. సహకారం అలవర్చుకోవాలి

స్వామి పరిజ్ఞానంద మహారాజ్


కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వామి పరిజ్ఞానంద మహారాజ్

సామర్లకోట: రామకృష్ణ, వివేకానందుల బోధనలు ఆచరణీయమని, ప్రతి వ్యక్తి అహంకార, మమకారాలు తగ్గించుకుని, సహకార గుణం అలవర్చుకోవాలని రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞానంద మహారాజ్ అన్నారు. మండలంలోని పీబీ దేవం గ్రామంలో శారదా రామకృష్ణ సేవా సమితి వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి సమితి గౌరవాధ్యక్షుడు వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పరిజ్ఞానంద మహారాజ్ మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి పరోపకార గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తన సంపాదనలో సమాజం కోసం కొంత ఖర్చు చేయాలన్నారు. మరో ఆధ్యాత్మిక వేత్త ఇంద్రకంటి సత్యనారాయణ మాట్లాడుతూ, త్యాగం, కరుణను ప్రతి వ్యక్తి కలిగి ఉండాలన్నారు. వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ మాట్లాడుతూ, సేవా సమితి ఆధ్యాత్మిక సేవతో పాటు విద్య, వైద్య రంగాల్లో కూడా భాగస్వామ్యం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ, సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, సభ్యులు నవ్వుల వెంకట్రాజు, టీవీవీ సత్యనారాయణ, ఎ.సత్యనారాయణ, నరసింహారావు, సీహెచ్‌వీవీ సత్యనారాయణ, తోటకూర నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు


పంచారామ క్షేత్రంలోని కుమారారామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: పవిత్రమైన పంచారామ క్షేత్రంలో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. వైశాఖ శుద్ధ పౌర్ణమి కావడంతో ఆలయంలో స్వామి, అమ్మవార్లకు, ఉపాలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ఆలయ ప్రదక్షిణ చేయించారు. స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామివారి తొలి అభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరణిలోని నీటితో అభిషేకాలు చేశారు. భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో శనగలు, పులిహోర, అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లాకి రాజగోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు.

ఫలసాయానికి రేపు వేలం

సామర్లకోట: పట్టణంలోని విస్తరణ శిక్షణ కేంద్రంలోని మామిడి చెట్ల ఫలసాయానికి బుధవారం ఉదయం 11 గంటలకు ఈటీసీ కార్యాలయంలో బహిరంగ వేలం జరుగుతుందని సంస్థ ప్రిన్సిపాల్ జి.రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్చు పాటదారులు ఈ నెల 15 నుంచి జూలై 14 వరకు రెండు నెలల పాటు చెట్ల నుంచి వచ్చే ఫలసాయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.వెయ్యి డిపాజిట్‌గా చెల్లించి, వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు కార్మికుల సమ్మె


పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

సామర్లకోట: తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని పెద్దాపురం మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం ఆరో రోజుకు చేరింది. పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం చెవిలో పువ్వులు పెట్టుకుని, మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 15 ఏళ్లు దాటిన మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, విధి నిర్వహణలో చనిపోతే రూ.10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, స్కిల్, నాన్ స్కిల్ వర్కర్లను గుర్తించి కార్మిక చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో చేసిన సమ్మె సమయంలో హామీలిచ్చి, ఇప్పటి వరకు సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. దీంతో మళ్లీ సమ్మె చేపట్టినట్టు కార్మిక నాయకులు తెలిపారు.

వీర మరణం మహోన్నత త్యాగం


మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్సై తదితరులు

సామర్లకోట: దేశం కోసం ప్రాణాలు అర్పించడం మహోన్నత త్యాగానికి ప్రతీక అని పెద్దాపురం ఎస్సై వి.మౌనిక అన్నారు. పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌లో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు 30 రోజుల పాటు గుడ్లు, అంబలి అందించే కార్యక్రమాన్ని సోమవారం ఎస్సై ప్రారంభించారు. మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి రాజేష్‌కుమార్ దేవత ద్వారా వెలగా త్రిపుర, సుధీర్ వీటిని రూ.30 వేలతో అందజేశారు. తొలుత భారత్–పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాసు, ప్రతినిధులు కూనిరెడ్డి రవికుమార్, అమృత, నమ్రత, సాయి, కరాటే శిక్షకుడు తెప్పల రాజేష్, పీఈటీ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు బేబీరాణి

కొత్తపల్లి: వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సీఐటీయూ జాతీయ ఉపాధ్యాక్షురాలు బేబీరాణి డిమాండ్ చేశారు. స్థానిక ముప్పారపు అచ్చియ్యమ్మ కల్యాణ మండలంలో సోమవారం సీఐటీయూ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్న 18 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. పరిశ్రమల్లో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ నాయకులు కె.నాగేశ్వరరావు, గుత్రాల అప్పారెడ్డి, కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సింగరమ్మతల్లి ఆలయ అర్చకులకు న్యాయం చేయాలి

జగ్గంపేట: జగ్గంపేట, గోకవరం మండలాల సరిహద్దుల్లో వేంచేసిన సింగరమ్మతల్లి ఆలయ అర్చకులకు న్యాయం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ డిమాండ్ చేసింది. జగ్గంపేట ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో సోమవారం లిబరేషన్ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. గత కొన్నేళ్లుగా ఆలయ అర్చకురాలిగా పనిచేస్తున్న వట్టికూటి సీతామహాలక్ష్మి ఇంటిని, కిరాణాషాపును ఇటీవల మల్లిసాలకు చెందిన టీడీపీ నాయకులు తొలగించడంతో ఆమె జీవనాధరం కోల్పోయిందన్నారు. జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తే ప్రాణాలు తీస్తామని బెదిరిస్తున్నారని, గోకవరం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టిసారించి న్యాయం చేయాలని కోరారు.